పత్తి సాగుకే మొగ్గు

- గతేడాది తగ్గిన సోయా దిగుబడి
- మండలంలో భారీగా పెరిగిన పత్తి, కంది సాగు


పొన్నారి శివారులో సాగు చేస్తున్న పత్తి

తాంసి: వానాకాలం సీజన్‌లో మండలంలోని రైతులు పత్తి పంట సాగు చేసేందుకే ఆసక్తి చూపుతున్నారు. గత రెండేళ్ల క్రితం సోయాబీన్, కంది, మినుము, పెసర, మొక్కజొన్న పంటలను అధికంగా సాగు చేశారు. పప్పుదినుసులల రేట్లు తగ్గడంతో పాటు బహిరంగ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ ఉండడంతో పత్తి ధర కూడా మద్దతు ధర కంటే ఎక్కువ రేటు పలికింది. దీంతో పత్తి పంట సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. గతేడాది పత్తితో పాటు సోయా పంటను సాగు చేశారు. సోయా చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో పంట దెబ్బతిని ఆశించినంత దిగుబడి రాలేదు. దీంతో సోయా రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం కూడా మద్దతు ధర పెంచడంతో పత్తి పంట ఎక్కువగా సాగు చేస్తున్నారు.

గతేడాది సాగు వివరాలు ఇలా..
గత సంవత్సరం తాంసి, భీంపూర్ ఉమ్మడి మండలంలో వానాకాలం సాగు వివరాలను చూస్తే తాంసి మండలంలో 17 వేల ఎకరాలకు 13 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా.. 4 వేల ఎకరాలలో సోయా, కంది, ఇతర పంటలు సాగు చేశారు. భీంపూర్ మండలంలో 30 వేల ఎకరాలకు 24వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. మిగతా 6 వేల ఎకరాల్లో సోయా, మొక్కజొన్న, మినుము పంటలు వేశారు. ఈఏడది కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర పెంచడంతో పత్తిని సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. సోయా సాగు మండల వ్యాప్తంగా

సోయా దిగుబడిపై ప్రభావం..
గతేడాది మండల వ్యాప్తంగా రైతులు అధికంగా సోయా సాగు చేశారు. వాతావరణం అనుకూలించక పోవడంతో సరైన దిగుబడి రాలేదు. పంట ఎదిగే సమయంలో కాండం తొలుచు పురుగు ఉధృతి, తెగుళ్ల సోకి దిగుబడిపై ప్రభావం చూపింది. ఎకరానికి 3 నుంచి 4 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. దీంతో ఈఏడాది రైతులు పత్తి సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

తగ్గిన సోయా దిగుబడి



గత ఏడాది మూడు ఎకరాల్లో సోయా సాగు చేశాను. తెగుళ్ల ఉధృతికి సరైన దిగుబడి రాలేదు. మూడు ఎకరాల్లో కేవలం 11 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. దీంతో నష్టపోవాల్సి వచ్చింది.

– గడ్డం సురేందర్, తాంసి

పత్తి సాగు చేస్తున్న



గతేడాది సోయా సాగు చేసిన దిగుబడి ఆశించినంత రాక నష్టపోవాల్సి వచ్చింది. ఆరుగాలం కష్టపడి పండిస్తే కాలం అనుకూలించక దిగుబడి రాలేదు. పత్తికి అధికంగా రేటు ఉంటుందనే ఆశతో 20 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నాను.

– కంది హరీశ్‌రెడ్డి, జామిడి

అన్నివర్గాల సంక్షేమానికి కృషి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న


రేషన్ దుకాణం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మండలంలోని బంగారుగూడ గల మదర్స్, లిల్‌బానత్‌లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులపై తల్లిదండ్రులు పెట్టినా నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత స్థాయిలో రాణించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చే మోసపూరిత వాగ్దానాలు చేసే పార్టీలను నమ్మవద్దని సూచించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జాహిర్ రంజానీ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, అబ్దుల్ అజీమ్, అన్వర్, మౌలన మంజూర్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం
కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే జోగు రామన్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. స్వయంగా బియ్యం తుకాం వేసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, తదితరులు పాల్గొన్నారు.

‘నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు’


మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

బోథ్: పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం బోథ్‌లోని రైతువేదికలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్మికులు చేపడుతున్న పారిశుధ్య పనులను ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎంపీవో జీవన్ రెడ్డి, ఉపాధిహామీ ఏపీవో జగ్దేరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటిని నిల్వ ఉంచొద్దు
ఇంటి ఆవరణలో నీటిని నిల్వ ఉంచొద్దని డీపీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని కౌట గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. నీరు నిల్వ ఉంటే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలించారు. గ్రామం స్వచ్ఛ పంచాయతీగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎంపీవో జీవన్ రెడ్డి, సర్పంచ్ రాధిక గంగాధర్, తదితరులున్నారు.

‘పోడు పట్టాలు అందించాలి’


ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లి మండలంలోని దొడందా గ్రామంలో వంద మంది గిరిజన రైతులు పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా.. అధికారులు పట్టాలు ఇవ్వలేదని సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి పట్టాలు అందించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన పీవో విచారణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దొడంద గ్రామ గిరిజనులకు ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్రట ఉపాధ్యక్షుడు కుడ్మెత తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావు, పెందూర్ పుష్పరాణి, గేడం భారత్, రజినీకాంత్, మురారీ, శంకర్‌లు మద్దతు తెలిపారు.

నేరడిగొండ: ఏన్నో ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్న ఎస్సీ, బీసీ, మైనార్టీలకు పోడు పట్టాలు అందించాలని కొరటికల్ గ్రామస్తులు కోరారు. కొరటికల్ గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం గస్కంటి రవి అధ్యక్షతన పోడు భూముల కమిటీని ఎన్నుకన్నారు. కార్యక్రమంలో సాబ్లే గోవింద్, కేవల్ సింగ్, గ్రామస్తులు ప్రతాప్ సింగ్, హీరాసింగ్, అశోక్ పాల్గొన్నారు.

సెలవులు మంజూరు చేయాలి

ఆదిలాబాద్: వేసవి సెలవుల్లో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో విధులు నిర్వహించిన వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని పెటా (టీఎస్) సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారథి, స్వామి కోరారు. సోమవారం డీఈవో ప్రణీతకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఈటీలు హరిచరణ్, నాందేవ్ పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి కాపాడాలి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో కోతులు, పందుల బెడద నుంచి ప్రజలను కాపాడాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ అన్నారు. కోతులు గుంపులుగా తిరుగుతూ ఇళ్లలోకి వచ్చి బీభత్సవం సృష్టిస్తున్నాయని, మహిళలు, చిన్నారులపై దాడులు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఎంపీడీవో తిరుమలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుశీల్, సతీశ్, ముజీబ్, అబ్రార్ పాల్గొన్నారు.

అన్నదానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సేదూర మారుమూల ప్రాంతాల నుంచి ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే అర్జీదారుల ఆకలి తీర్చేందుకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ సోమవారం అన్నదానం నిర్వహించారు. గ్రీవెన్స్‌కు వచ్చిన వారికి అన్నం వడ్డించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బిరుదుల లాజర్, మానిక్‌రావు, ఆత్రం రాహుల కోటేశ్వర్, దూట రాజేశ్వర్, సలీం, దేవానంద్, జైవంరావు, సయ్యద్‌నిసార్, రాంకిషన్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఆదిత్య నగర్‌కు చెందిన ఓ బాలుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన అరుణ్ అనే వ్యక్తి వారి ఇంటికి వెళ్లి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశాడు. ప్రభుత్వం బాలుడికి వైద్య సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

నార్నూర్: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని గంగాపూర్ గ్రామపంచాయతీ పరి ధిలోని ఆర్అండ్‌బీ రోడ్డు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ ఆయన ప్రారంభించారు. ఆయన మా ట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్క రూ మొక్కలు నాటాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ వంద శాతం పూర్తి చేయాలని ఉపాధి హామీ టీఏలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం మండలాధ్యక్షుడు ఊర్వేత రూపుదేవ్, టీఏ కైలాస్ జాదవ్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

‘భూములు తిరిగి ఇచ్చే వరకు పోరాడుతాం’


వినతిపత్రం అందజేస్తున్న గణేశ్ మహరాజ్

జైనథ్: మండలంలోని పలు గ్రామాల్లో దళితుల సీలింగ్ భూములను కొంతమంది అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని, వాటిని తిరిగి ఇచ్చే వరకు ధర్మసమాజ్ పార్టీ పోరాటం చేస్తుందని జిల్లా అధ్యక్షుడు గణేశ్ మహరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని మేడిగూడ- ఆర్, మెడిగూడ(కె) గ్రామ బాధితులతో కలిసి తహసీల్దార్ రాఘవేంద్రరావును కలిసి విన్నవించారు. మేడిగూడలో 22 మంది భూములను లీజ్ పేరిట తీసుకొని, తప్పుడు సేల్ డీడ్‌లు సృష్టించారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ భూముల మ్యుటేషన్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దళితుల భూములను కొల్లగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్, దేవన్న, సంజీవ్, గజానన్, తదితరులు ఉన్నారు.

‘అధికారంలోకి రాగానే రుణమాఫీ’


మాట్లాడుతున్న అడె గజేందర్

ఇచ్చోడ: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు అడే గజేందర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, భీమన్న, ముస్తాఫా, కొత్తురి లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన గంటుబాయి
ఆదిలాబాద్‌రూరల్: జిల్లా ఆదివాసీ ఉత్తమ మహిళా అవార్డు అందుకున్న ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పిప్పల్‌దరి గ్రామ పంచాయతీ పరిధిలోని దహిగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ నాయకురాలు గంటుబాయి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డిలు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇంటింటికీ తిరుగుతూ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి ప్రజలకు వివరించారు.

గిరిజన గ్రామాల్లో అభివృద్ధి శూన్యం
ఇంద్రవెల్లి: గిరిజన గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వెడ్మ భోజ్జు అన్నారు. సోమవారం మండలంలోని అంజీ గ్రామంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గిరిజన గ్రామాల్లో ఎక్కడ చూసినా సమస్యలేనని, ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలు అమలు చేసి, నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముఖడే ఉత్తం, మహ్మద్ జహీర్, ఆత్రం కల్యాణ్, సోమసే వెంకట్ రావ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రీతంరెడ్డి

ఇచ్చోడ: మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎంపీపీ నిమల్మ ప్రీతంరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అభివృద్ధిలో ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు భాగస్వాములు కావాలని కోరారు. సమావేశానికి రాని ఉద్యానవన, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీశాఖ, అగ్నిమాపకశాఖ, అబ్కారీ, చిన్ననీటిపారుదల శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించాలని సమావేశంలో తీర్మానించారు. భీమన్న గుట్ట వద్ద మిగిలిన ప్రభుత్వ భూమిలో మండల కేంద్రానికి చెందిన అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఓటర్ జాబితాలో పేర్లను నమోదు చేయించాలని ఎంపీడీవో రాంప్రసాద్ కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ జాదవ్ రామారావు, ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

‘బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం’


కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని చాందా (టి) గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. బీజేపీకి ఉన్న ఆదరణను చేసి ఎమ్మెల్యే జోగు రామన్న ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. కేంద్రం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తే అందులో డాక్టర్లను నియమించుకోలేని పరిస్థితిలో ఎమ్మెల్యే జోగు రామన్న ఉన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు దారట్ల జీవన్, రఘుపతి, సంతోశ్, మయూర్ చంద్రా, రాజు, దయాకర్, సత్యానారాయణ, రవి, నాందేవ్, సూర్య, ఫరీద్, రాకేశ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి
ఆదిలాబాద్‌టౌన్: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని పలు పాఠశాలలను ఆమె సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేజీ టు పీజీ నిర్బంధ విద్యను అందిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, బాలికలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి కనీసం మరుగుదొడ్లు లేవన్నారు. ఆమె వెంట బీజేపీ నాయకులు దారట్ల జీవన్, లీలావనతి, సతీశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చందు, శివ, సందీప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాల (బోథ్)లో 2023- 24 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు మంగళవారం నుంచి ఈనెల 20 వరకు స్పాట్ కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ (హెచ్‌ఈపీ), బీకాం (సీఏ), బీజెడ్‌సీ, డాటా సైన్స్, ఎంపీసీఎస్‌లో దరఖాస్తులను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. వివరాలకు 62819 59844 సంప్రదించాలన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు..
జైనథ్: ఓపెన్ స్కూల్‌లో 2023- 24 పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోఆర్డినేటర్ మద్ది లస్మన్న తెలిపారు. ఈనెల 10 నుంచి ఆగస్టు 10 వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు రాధ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఛోటా తలాబ్ అంగన్‌వాడీ కేంద్రంలో కోర్కెల దినం సందర్భంగా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. సుజాత, సునంద, పాల్గొన్నారు.

విద్యార్థినులు ధైర్యంగా ముందుకెళ్లాలి

ఉట్నూర్‌రూరల్: విద్యార్థినులు ధైర్యంగా ముందుకెళ్లాలని ఎషీటీం సభ్యులు కమల్, భాగ్యశ్రీలు అన్నారు. సోమవారం మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధించిన, ఇబ్బందులకు గురిచేసినా.. వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అన్ని వసతులు

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. సోమవారం మండలంలోని పట్‌పటితండా గ్రామంలోని అంగన్‌వాడీని సందర్శించారు. కొత్తగా చేరిన మూడు సంవత్సరాల పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం కుంటాల అంగన్‌వాడీ కేంద్రంలో ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల్లోపు పిల్లలకు బాలామృతం, కోడి గుడ్లు పంపిణీ చేశారు.

ముగిసిన పెద్ద పండుగ

నేరడిగొండ: పెద్ద పండగ కార్యక్రమాన్ని వైదూర్యపురం (వడూర్) గ్రామంలో ఐదు రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం వేడుకలు ముగిశాయి. గత 32 సంవత్సరాల క్రితం చేపట్టామని, ఈసారి అందరి సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశామని గ్రామస్తులు పేర్కొన్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండడంతో పాటు గ్రామస్తులంతా సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హీరాపూర్, పాత హీరాపూర్, శాంతపూర్, తేజాపూర్ గ్రామాల్లో సీఐ రామకృష్ణ, ఎస్సై మహేశ్‌లు సోమవారం పర్యటించి మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. బాల్య వివాహాలకు ప్రోత్సహించవద్దని, మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా.. వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటేనే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

నార్నూర్: గాదిగూడ మండలంలోని కుండిశేకుగూడ గ్రామ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం గాదిగూడ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామానికి కనీస రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. అలాగే త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. సీడం దౌలత్రావు, గ్రామపటేల్ కోర్ట్‌నాకు సక్కు, భీమురావు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కైలాస్‌నగర్: మత్స్యకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు కోరారు. సోమవారం ఆశాఖ కార్యాలయంలో మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చేపల పెంపకం, మార్కెటింగ్ వసతులపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందన్నారు. గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూమన్న, అశోక్, రమేశ్, సవిత, సునీత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గ్రామసభ వాయిదా
ఇచ్చోడ: మండలంలోని అడేగామ (కె)లో గ్రామసభను వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ జాదవ్ రామారావు తెలిపారు. ఇంటి స్థలాల కోసం నిర్వహించిన గ్రామ సభలో గ్రామస్తులు ఆందోళన చేయడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామసభ నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

హోంమంత్రిని కలిసిన జెడ్పీటీసీ
ఉట్నూర్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా మహిళా భద్రతా కోసం అన్ని మండలాల్లో మహిళా పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీని సోమవారం హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. ఇటీవల ఇంద్రవెల్లి మండలంలో జరిగిన గిరిజన మహిళ హత్య గురించి వివరించడం జరిగిందన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన
కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని హమీద్‌పుర కాలనీలో ఈవీఎంల ద్వారా ఓటు వినియోగంపై డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్ సోమవారం అవగాహన కల్పించారు. ప్రచార రథం ద్వారా కాలనీలో తిరుగుతూ ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ద్వారా ఓటును ఏ విధంగా వినియోగించుకోవాలో వివరించారు.

ప్రత్యేక పూజలు
ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలంలోని సాలెవాడ (కె)లో శ్రీవిఠల్ రుక్మాయి పండర్‌పూర్ యాత్ర సందర్భంగా ఉమ్మడి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు, ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ నాయకులు అజ్మీరా శ్యాంనాయక్ భక్తులతో కలిసి యాత్రలో పాల్గొన్నారు. అనంతరం హరహర మహాదేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా ప్రేమేందర్
తలమడుగు: ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా గోంటి ముక్కల ప్రేమేందర్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆశన్న, జిల్లా కన్వీనర్ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం
కైలాస్‌నగర్: టీడీపీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన అల్లూరి రాజారెడ్డిని సోమవారం నాయకులు ఘనంగా సన్మానించారు. పార్లమెంట్ అధికార ప్రతినిధి ఎండీ.రఫీక్, ఓమన్న, షేక్ అహ్మద్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత
బోథ్: మండలంలోని పొచ్చెర క్రాస్‌రోడ్డు వద్ద ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను జాతి రత్నాలు టీం సభ్యులు ఆదివారం రాత్రి పూడ్చివేశారు. కార్యక్రమంలో సభ్యులు నవీన్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, అల్లకొండ పోతున్న, విశ్వనాథ్, లింగారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోను కలిసిన నాయకులు
ఉట్నూర్‌రూరల్: ఇటీవల ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయ్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీజను నాల్గో తరగతి, గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి సోమవారం సన్మానించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆర్ఎస్ శంకర్, గౌరవ అధ్యక్షుడు ఖాజా నస్రొద్దిన్, ఏరుకొండ రాజన్న, రాథోడ్ బాపురావు, రాము, బాపురావు, మారుతిరావు, రమేశ్ పాల్గొన్నారు.

రైతుబీమా నామినీ మార్చుకునేందుకు అవకాశం
ఇచ్చోడ: గతంలో రైతుబీమాలో నమోదు చేసుకున్న వారు నామినీ మార్చుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో నామినీగా నమోదు చేసుకున్న వారు మార్చుకునేందుకు వ్యవసాయ విస్తర్ణ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సెల్‌ఫోన్ అందజేత
ఇంద్రవెల్లి: ఉట్నూర్ మండలానికి చెందిన చునిలాల్ యువకుడు ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాకింగ్ చేసి, సోమవారం బాధితుడు చునిలాల్‌కు అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న క్షమాదేశ్‌పాండే

తలమడుగు: చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. సోమవారం మండలంలోని ఉమ్రీ గ్రామంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కేసులు ఉన్న వారు రాజీమార్గంలో ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. చట్టాలపై అవగాహన కల్పించాలని ఉద్దేశంతో గ్రామాల్లో న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. బడీడు పిల్ల లను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అశోక్, హెచ్ఎం సరస్వతి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.